ఈక్విటీ ఫండ్లకు తగ్గుతున్న గిరాకీ

న్యూఢిల్లీ/ముంబై, జూన్ 10: దేశీయ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ల (ఎంఎఫ్)కు గిరాకీ తగ్గిపోయింది. గత నెలలో వచ్చిన పెట్టుబడులు 13 నెలల కనిష్ఠానికి దిగజారాయి. మే నెలలో రూ.19,013 కోట్లకు పరిమితమయ్యాయి. 2024 ఏప్రిల్ తర్వాత ఈ స్థాయిలోనే ఉండటం ఇదే తొలిసారి. నాడు రూ.18,917 కోట్లు వచ్చాయి. కాగా, ఈసారి లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ ఫండ్స్ అన్నింటిలోకి ఇన్వెస్ట్‌మెంట్లు పడిపోవడం గమనార్హం. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడమే కారణమని మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. అలాగే సూచీలు కన్సాలిడేషన్ దశలోకి వెళ్తుండటం కారణమేనంటున్నారు.

ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నానాటికి క్షీణిస్తున్న పెట్టుబడులు

నెల	పెట్టుబడులు (రూ.కోట్లలో)
డిసెంబర్ (2024)	41,156
జనవరి (2025)	39,688
ఫిబ్రవరి	29,303
మార్చి	25,082
ఏప్రిల్	24,269
మే	19,013

వరుసగా ఐదో నెల

ఈక్విటీ ఫండ్స్‌ల్లోకి పెట్టుబడులు క్షీణించడం వరుసగా ఇది ఐదో నెల. ఇక ఈ ఏడాది ఏప్రిల్‌తో పోల్చితే మే నెలలో దాదాపు 22 శాతం పతనం కనిపిస్తున్నట్టు మంగళవారం భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ (యాంఫీ) తెలిపింది. ఈక్విటీ ఎంఎఫ్‌ల్లోకి నెలవారీగా ఎంతోకొంత పెట్టుబడులు రావడం మాత్రం ఇది (మే) 51వ నెల.

సిప్‌లకు ఆదరణ

సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్‌కు ఇన్వెస్టర్లలో ఆదరణ బాగానే కనిపిస్తున్నది. మే నెలలో రూ.26,688 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.26,632 కోట్లుగా నమోదయ్యాయి.



మే నెలలో పెట్టుబడుల తీరిది..

- ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌ల్లోకి అత్యధికంగా రూ.3,841 కోట్ల పెట్టుబడులు.
- ఈక్విటీ ఆధారిత సేవింగ్ స్కీముల నుంచి రూ.678 కోట్ల పెట్టుబడులు ఉపసంహరణ.
- వాల్యూ ఫండ్స్‌ల నుంచి రూ.92 కోట్లు, డివిడెండ్ ఈల్డ్ ఫండ్స్‌ల నుంచి రూ.21 కోట్లు ఔట్.
- లార్జ్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.1,250 కోట్లు వచ్చాయి. ఏప్రిల్‌లో రూ.2,671 కోట్లు పోయాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్ నుంచి రూ.2,808 కోట్లు వెనక్కి.
- స్మాల్‌క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.3,214 కోట్లు రాక.
- రూ.292 కోట్ల పెట్టుబడుల్ని ఆకర్షించిన గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్).
- డెట్ ఫండ్స్‌ల నుంచి రూ.15,908 కోట్లు ఔట్.

సెన్సెక్స్ లాభాలకు బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ నష్టపోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ స్వల్పంగా లాభపడింది. సెన్సెక్స్ 53.49 పాయింట్లు పడిపోయి 82,391.72 వద్ద ముగిసింది. అయితే 1.05 పాయింట్లు పెరిగి 25,104.25 వద్ద నిఫ్టీ నిలిచింది. నిజానికి అంతకుముందు 4 రోజులపాటు రెండు సూచీలు లాభాల్లోనే స్థిరపడ్డ విషయం తెలిసిందే. దీంతో వరుస లాభాలకు బ్రేక్ పడినట్టైంది. కాగా, ఐటీ, యుటిలిటీస్, పవర్, టెక్నాలజీ, హెల్త్‌కేర్, కమొడిటీస్ షేర్లు పెరిగాయి. రియల్టీ, టెలికం, ఆర్థిక సేవలు తదితర రంగాల షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.33 శాతం, స్మాల్‌క్యాప్ 0.04 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్ షేర్లలో ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ, ఆర్ఐఎల్ షేర్లు నష్టపోయాయి.

ఈవీల ఉత్పత్తికి బ్రేక్!

చైనా నుంచి ఆగిన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్

న్యూఢిల్లీ, జూన్ 10: సెమీకండక్టర్ సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న దేశీయ ఆటో పరిశ్రమను మరో ఉపద్రవం ముంచెత్తబోతున్నాదా! ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. తమ దేశంలో లభించే అరుదైన రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించడంతో ప్రపంచవ్యాప్తంగా వీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈ తాజా పరిణామంతో వాహన ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపి భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈవీ విస్తరణ లక్ష్యాలను దెబ్బపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశీయ ఆటోమోటివ్ తయారీదారులు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహన ఉత్పత్తిలో నిమగ్నమైన వారు అరుదైన భూ అయస్కాంతాల కొరత కారణంగా ఈ ఏడాది జూలై నాటికి తమ ఈవీ వాహనాల ఉత్పత్తిని నిలిపివేయక తప్పదని పరిశ్రమ వర్గాలు సూచించాయి.

ఏమిటీ అరుదైన భూ అయస్కాంతం?

అధునాతన వాహనాలు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ వాహనాలు, హైబ్రిడ్‌లకు అరుదైన భూ అయస్కాంతాలు అత్యంత అవసరం. ఎలక్ట్రిక్ మోటర్లు, బ్రేకింగ్ సిస్టమ్, పవర్ స్టీరింగ్, సమర్థవంతంగా పనిచేయడం కోసం బలమైన అయస్కాంత శక్తిపై ఆధారపడే ఇతర సిస్టమ్‌లకు ఈ భూ అయస్కాంతం తప్పనిసరి. ప్రస్తుతం ప్రపంచ దేశాలకు 90 శాతానికి పైగా చైనా నుంచే ఇవి సరఫరా అవుతున్నాయి. కొన్ని అరుదైన మిశ్రమ లోహాలు, శాశ్వత అయస్కాంతాల ఎగుమతిపై ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా కఠిన నిబంధనలు విధించింది. జాతీయ భద్రతా ఆందోళనల కారణంగా ఈ చర్యలు తీసుకున్నప్పటికీ, అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు ప్రతిస్పందనగా ఈ చర్య తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

నయా అపాచీ ఆర్‌టీఆర్ 200

ధర రూ.1,53,900

చెన్నై, జూన్ 10: ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టీవీఎస్ మోటర్ కంపెనీ..తాజాగా 2025 టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీ మోటర్‌సైకిల్‌ను పరిచయం చేసింది. అడ్వాన్స్ టెక్నాలజీ, సూపీరియర్ పనితీరు, భద్రత ప్రమాణాలను మెరుగుపరిచి ఈ బైకును తీర్చిదిద్దినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దేశవ్యాప్తంగా కంపెనీకివున్న అవుట్‌లెట్లలో లభించనున్న ఈ బైకు ధర రూ.1,53,900గా నిర్ణయించింది. దేశీయ మార్కెట్లోకి అపాచీ బైకులు అడుగుపెట్టి 20 ఏండ్లు పూర్తైనట్టు, ఇప్పటి వరకు 60 లక్షల యూనిట్ల బైకులు దేశీయ రోడ్లపై దూసుకుపోతున్నాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రంలోకి 2 వేల కోట్ల పెట్టుబడులు

ముందుకొచ్చిన యూఏఈ కంపెనీలు
కొత్తగా 5వేల మందికి ఉద్యోగావకాశాలు

హైదరాబాద్, జూన్ 10(నమస్తే తెలంగాణ): పెట్టుబడులు ఆకట్టుకోవడంలో రాష్ట్రం దూసుకుపోతున్నది. తాజాగా యూఏఈకి చెందిన శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్‌లు సంయుక్తంగా రూ.2,125 కోట్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇందుకు రాష్ట్రానికి చెందిన ఐదు స్థానిక కంపెనీలతో ఈ రెండు అరబ్ సంస్థలు అవగాహన ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఈ పెట్టుబడులతో కొత్తగా 5 వేల మందికి పైగా తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. వీటిలో శైవ గ్రూపు, తారనిస్ క్యాపిటల్ సంయుక్తంగా రివిలేషన్ బయోటెక్‌లో రూ.1,360 కోట్లు పెట్టుబడులు పెట్టబోతుండగా.. మనాకిన్ బయో రూ.340 కోట్లు, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ రూ.80 కోట్లు, ఎగ్జిజెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ రూ.90 కోట్లు, యెంత్రా టెక్ కంట్రోల్స్ రూ.255 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని మంత్రి చెప్పారు. దీంతోపాటు వచ్చే మూడేండ్లలో బయోటెక్, ఏఐ, డాటా సెంటర్, డిఫెన్స్, ఎనర్జీ, ఫిన్‌టెక్ తదితర రంగాల్లో రూ.24 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు శైవ, తారనిస్ క్యాపిటల్ సంసిద్ధత వ్యక్తం చేసినట్టు శ్రీధర్ బాబు వెల్లడించారు. అలాగే ఈ రెండు సంస్థలు వచ్చే మూడేండ్లలో బయోటెక్ రంగంలో తినుబండారాల్లో చక్కెర శాతాన్ని తగ్గించడం, యాంటీ డయాబెటిక్, ఫుడ్ మేనేజ్‌మెంట ఉత్పత్తులు, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ రంగాల్లోవున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి శైవ గ్రూపు చైర్మన్, సీఈవో అమిత్ జగన్నాథ్ వర్మ, తారనిస్ క్యాపిటల్ సీఈవో నికోలస్ ఎస్.బింగ్ హామ్, రివిలేషన్స్ బయోటెక్ ఎండీ రవిచంద్ర బీరం, మనాకిన్ బయో డైరెక్టర్ జశ్వంత్ ప్రణవ్ యతిరాజం, స్వబోధ ఇన్ఫినిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ అడ్వైజర్స్ సీఈవో సంకర్ష్ చందా, ఎగ్జిగెంట్ డ్రిల్లింగ్ టెక్నాలజీ డైరెక్టర్ పాండురంగా రావు తదితరులు హాజరయ్యారు.

మోసపూరిత పెట్టుబడులు

- ఎంసీఏలో మనకిన్ బయో నమోదవ్వలేదు
- ఆ సంస్థ రూ.340 కోట్ల పెట్టుబడి అనుమానాస్పదమే
- నష్టాల్లో యెంత్రా టెక్ కంట్రోల్స్
- అయినా రూ.255 కోట్ల పెట్టుబడి?
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ సంచలన ఆరోపణలు

హైదరాబాద్, జూన్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత పెట్టుబడులను ప్రకటించి ప్రజలను వంచిస్తున్నదని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ ధ్వజమెత్తారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో గోడాడి ఇండియా, స్వచ్ఛ్ బయో, వాల్ష్ కర్రా, ఉర్సాలాంటి సంస్థల పేరుతో అనుమానాస్పద పెట్టుబడులు ప్రకటిస్తున్నదని మండిపడ్డారు. మనకిన్ బయో సంస్థ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ)లో కూడా రిజిస్టర్ కాలేదని పేర్కొన్నారు. ఎలాంటి నిర్దిష్ట వివరాలు లేకుండా ఒక మోసపూరిత వెబ్‌సైట్ ఈ ఏడాది మార్చి 16న సృష్టించారని ఆరోపించారు. ఆర్థిక పారదర్శకతలేని ఈ కంపెనీ రూ.340 కోట్ల పెట్టుబడి చేస్తున్నామని ప్రకటించడం అనుమానస్పదంగా ఉందన్నారు. నష్టాలను నమోదు చేస్తున్న యెంత్రా టెక్ కంట్రోల్స్ కంపెనీ రూ.255 కోట్ల పెట్టుబడి ఎలా పెట్టగలదు..? అని క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ మొత్తం వ్యవహారంపై త్వరలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



YENTRA TECH CONTROLS PRIVATE LIMITED
CIN - U74900TG2014PTC095623
Regd. Office: Ground Floor, Plot No 131, Road No 74 Jubilee Hills, Hyderabad, Telangana, India, 500033
rohit@yentra.org

DIRECTORS' REPORT

Dear Members,

Your directors have pleasure in presenting the 9th Annual Report of the Company together with the Audited Statements of Accounts for the financial year ended 31st March 2024.

1. FINANCIAL SUMMARY OR PERFORMANCE OF THE COMPANY:

The Net Financial Performance of the operations for the year are detailed herein under:

Particulars	For the year ended 31st March 2024 (Rs)	For the year ended 31st March 2023 (Rs)
Total Income	-	
Depreciation	233582.43	159348.21
Expenditure(Excluding Depreciation)	41033	2968504
Profit before Tax	(274615.43)	(3127852.21)
Current Tax		
Deferred Tax	40025.27	45288.26
Tax of earliers Years		-
Profit/(loss) after Tax	(234590.16)	(3173140.47)
Earnings Per Share (in Rs)	(23.46)	(317.31)

2. OPERATIONS:

During the year, the company there is no turnover/revenue from operations of against the previous year.

3. TRANSFER TO RESERVES:

During the year under review the company has transferred loss amount of Rs. (234590.16) to the reserves.

4. DIVIDEND:

No dividend was declared during the period.

Whois
manakin.bio

Domain Information
Domain: manakin.bio
Registered On: 2025-03-16
Expires On: 2027-03-16
Updated On: 2025-03-21
Status: client delete prohibited, client renew prohibited, client transfer prohibited, client update prohibited
Name Servers: ns25.domaincontrol.com, ns26.domaincontrol.com

Registrar Information
Registrar: GoDaddy.com, LLC
IANA ID: 146
Abuse Email: abuse@godaddy.com
Abuse Phone: +1.4806242505

Registrant Contact
Name: Registration Private
Organization: Domains By Proxy, LLC
Street: DomainsByProxy.com 100 S. Mill Ave, Suite 1600
City: Tempe
State: Arizona
Postal Code: 85281
Country: US
Phone: +1.4806242599

Technical Contact
Name: Registration Private
Organization: Domains By Proxy, LLC
Street: DomainsByProxy.com 100 S. Mill Ave, Suite 1600
City: Tempe
State: Arizona
Postal Code: 85281
Country: US
Phone: +1.4806242599

హైదరాబాద్‌లో ఆల్‌కార్గో గతి ఎయిర్ డెలివరీ సేవలు

ముంబై, జూన్ 10: లాజిస్టిక్, సరఫరా సేవల సంస్థ ఆల్‌కార్గో గతి లిమిటెడ్..డైరెక్ట్ ఎయిర్ సర్వీసులను మరో ఎనిమిది నగరాలకు విస్తరించింది. కేవలం 24 గంటల్లో డెలివరీ చేయడానికి ఈ ప్రత్యేక సర్వీసులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ సర్వీసులను హైదరాబాద్‌తోపాటు ముంబై, పుణె, కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో ప్రవేశపెట్టింది. దేశవ్యాప్తంగా 34 కమర్షియల్ ఎయిర్‌పోర్ట్స్‌తో అనుసంధానం కావడానికి సంస్థ..ఎయిర్ ఎక్స్‌ప్రెస్‌తో ఒప్పందాన్ని కూడా కుదుర్చుకున్నది.

ఐపీవోకి నాలుగు సంస్థలు

న్యూఢిల్లీ, జూన్ 10: దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి అడుగుపెట్టడానికి నాలుగు సంస్థలు సిద్ధమవుతున్నాయి. వీటిలో వ్యాటర్ ప్యూరిఫైర్ కంపెనీ కెంట్ ఆర్‌వో సిస్టమ్స్‌తోపాటు కారంతర ఇంజినీరింగ్, మంగల్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్, విద్యా వైర్స్‌ల ఐపీవోకి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటాల విక్రయం ద్వారా ఈ నాలుగు సంస్థలు కనిష్ఠంగా రూ.2,500 కోట్ల నిధులను సేకరించాలనుకుంటున్నాయి.

పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

నర్సంపేట, జూన్10: పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన పట్టణంలోని 15వ వార్డు వరమ్మతోటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తక్కళ్లపల్లి నర్సింహారావు-లక్ష్మి దంపతులు శుక్రవారం బంధువుల ఇంట్లో జరిగిన పెళ్లికి వెళ్లారు. సోమవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి తులంన్నర బంగారం, 20 తులాల వెండి వస్తువులు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌తోపాటు రూ. 50 వేల నగదును అపహరించారు. మంగళవారం నర్సంపేట టౌన్ సీఐ లేతాకుల రఘుపతిరెడ్డి, ఎస్సై రవి కుమార్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు.

పోలీసుల అదుపులో నిందితులు?

గీసుగొండ, జూన్ 10: వరంగల్ 17వ డివిజన్ స్తంభంపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి వృద్ధురాలిని హత్య చేసిన నిందితులను మంగళవారం ఉదయం గీసుగొండ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఒంటరిగా ఉంటున్న పోచన స్వరూపకు వద్దకు బంధువు అయిన వ్యక్తి తన మిత్రుడితో కలిసి వెళ్లాడు. ఆమెను నమ్మించి ఇద్దరు కలిసి డంబెల్‌తో తలపై మోది హత్య చేసి స్వరూప మెడలో ఉన్న రెండున్నర తులాల పుస్తెల తాడు, తులం చెవి కమ్మలు తోపాటు బీరువాలో ఉన్న రూ. 10 వేల నగదును తీసుకొని వెళ్లిపోయారు. సీఐ మహేందర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు తెలిసింది.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

గిర్మాజీపేట, జూన్ 10: అనుమతి లేకుండా పోచమ్మమైదాన్ ప్రాంతంలో పాఠశాల నిర్వహిస్తున్న షాహిన్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, వెంటనే పాఠశాలను సీజ్ చేయాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థి సంఘాల ప్రతినిధులు డీఈవో జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనుమతి లేని పాఠశాలలో పిల్లలను చేర్పించొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, శనిగరపు రాజేంద్రప్రసాద్, బీఎస్ఎఫ్ నాయకుడు రమేశ్ పాల్గొన్నారు.

నేడు ఆయిల్‌పాం గెలల సేకరణ కేంద్రం ప్రారంభం

నర్సంపేట, జూన్ 10: పట్టణంలోని ద్వారకపేట బైపాస్‌రోడ్డులో ఆయిల్‌పాం గెలల సేకరణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు వరంగల్ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్లు సతీశ్‌నారాయణ్, రామ్‌చరణ్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద ప్రారంభించనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

నల్లబెల్లి, జూన్ 10: విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన ఘటన మండలంలోని కొండాపూర్ ఏజెన్సీ గ్రామంలోని జరిగింది. మంగళవారం మేతకు వెళ్లిన రాజబోయిన రమేశ్‌కు చెందిన దుక్కిటెద్దు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లకు తగిలి మృతి చెందింది. రూ. లక్ష నష్టం జరిగినట్లు బాధిత రైతు వాపోయాడు. కాగా, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణాన్ని చేపట్టిన కాంట్రాక్టర్ ఇనుప కంచె ఏర్పాటు చేయలేదని స్థానికులు తెలిపారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పిల్లలతో సహా తల్లి అదృశ్యం

దామెర, జూన్ 10: మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామం నుంచి తల్లితోపాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. చెన్నారావుపేట మండలం పాపాయిపేట గ్రామానికి బొతు రజిత అలియాస్ మమతను హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన సాయిబాబా ప్రేమించుకుని వివాహం చేసుకున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. దామెర మండలం ముస్త్యాలపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు మే 7న రజిత పిల్లలతో కలిసి వచ్చింది. అదే రోజు రాత్రి ఎవరికీ చెప్పకుండా పిల్లలను తీసుకుని ఇంటి నుంచి వెళ్లింది. రజిత భర్త బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో దామెర పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు.

ఇండ్ల నిర్మాణంలో పురోగతి శూన్యం

- మేస్త్రీల కొరత, పెరిగిన సిమెంట్, ఇసుక ధరలు
- బిల్లుల చెల్లింపుపై అనుమానాలు
- పనులు చేపట్టేందుకు ముందుకురాని లబ్ధిదారులు

రామతీర్థంలో బేస్‌మెంట్ లెవల్‌లోనే నిలిసిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

నల్లబెల్లి, జూన్ 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో పురోగతి శూన్యమైంది. ప్రభుత్వం నర్సంపేట నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు డివిజన్‌లోని ఆరు మండలాల్లో కనీసం వంద ఇండ్లు కూడా ప్రారంభం కాలేదు. నల్లబెల్లి మండలానికి మొదటి విడతగా 430, ఖానాపురం 443, దుగ్గొండి 443, నెక్కొండలో మొదటి విడత 120, రెండో విడతలో 590, నర్సంపేట మున్సిపాలిటీతోపాటు రూరల్ మండలంలో మరో 1300 ఇండ్లు మంజూరయ్యాయి. అయితే, ఇంటి నిర్మాణాలకు ప్రధానంగా తాపీమేస్త్రీలు, ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు అందుబాటులో ఉండాలి. కానీ, మేస్త్రీల కొరతతో నిర్మాణ సామగ్రి ధరలు అధికం కావడంతో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలకు ముందుకు రావడం లేదు. ఇదిలా ఉంటే.. వర్షాలు ప్రారంభం కావడంతో ప్రజలు, రైతులు వానకాలం సాగులో నిమగ్నమయ్యారు. దీంతో ఇంటి నిర్మాణాలు పురోగతి సాధించడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ముగ్గులు పోసినప్పటికీ ఆశించిన ఫలితం సాధించలేకపోతున్నారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణాలు ప్రారంభిస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ బిల్లులు మంజూరు చేస్తుందో లేదోనని మీమాంసలో ఉన్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే కొందరు ముగ్గులు పోస్తుంటే.. పనులు ప్రారంభించిన వారు బిల్లులపై నమ్మకం లేక పునాదుల వద్దే నిర్మాణాలు నిలిపి వేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇండ్ల నిర్మాణాల పురోగతిపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రేషన్ బియ్యం కోసం తంటాలు

సర్వర్ డౌన్.. గంటల తరబడి నిరీక్షణ

నెక్కొండలో బియ్యం కోసం వేచి ఉన్న ప్రజలు

నెక్కొండ, జూన్ 10: మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తుండడంతో లబ్ధిదారులు నానా తంటాలు పడుతున్నారు. ఈ-పాస్ మిషన్‌లో మూడు నెలల వేలిముద్రలు అందించాల్సి రావడంతో ఒక్కో వ్యక్తికి బియ్యం అందించేందుకు 15 నిమిషాలకు పైనే పడుతున్నది. దీంతో షాపు వద్ద కనీసం రెండు గంటలకు పైగానే వేచి ఉండాల్సి వస్తున్నదని లబ్ధిదారులు వాపోతున్నారు. రోజుకు ఒక్కో షాపులో ఉదయం నుంచి సాయంత్రం వరకు కనీసం 20 నుంచి 25 మందికి మాత్రమే బియ్యం ఇస్తున్నారు. ఇదిలా ఉంటే.. రేషన్ షాపుల్లో మే నెలకు సంబంధించిన దొడ్డు రకం బియ్యం నిల్వలు ఉన్నాయి. రేషన్ షాపుల్లో జూన్, జూలై, ఆగస్టు కోటాను ఒకేసారి అందించడంతో సన్న బియ్యం నిల్వలు పేరుకుపోయాయి. మూడు నెలల సన్నరకం బియ్యాన్ని భద్రపరచడమే సమస్యగా మారింది. ఇలాంటి తరుణంలో మే నెలలో లబ్ధిదారులకు పంపిణీ కాకుంగా మిగిలిన ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోవడంతో డీలర్లకు సన్న బియ్యం నిల్వ చేసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సందర్భంగా రేషన్ డీలర్ల సంఘం నెక్కొండ మండల అధ్యక్షుడు గోరంటల వెంకటనారాయణ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు తెచ్చి సర్వర్ డౌన్ సమస్య లేకుండా చేయాలని కోరారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

కాశీబుగ్గ, జూన్ 10: తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 24, 25న ఎంపిక ఉన్నట్లు డీఎస్‌డీవో సత్యవాణి తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు కాశీబుగ్గ ఓసిటీ ఇండోర్ స్టేడియంలో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనేవారు ముందుగా tgss.telangana.gov.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

నర్సంపేట/పోచమ్మమైదాన్, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గడపకు వెళ్లి బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో కొర్ర సారయ్య, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అంగన్‌వాడీ కేంద్రాలు, తల్లిదండ్రుల వద్దకు వెళ్లి పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు. హెచ్ఎం ఎండీ రఫీ, అంగన్‌వాడీ టీచర్ కవిత, టీచర్లు నర్సింగరావు, హరిప్రసాద్, రమేశ్, వినయ్, అపర్ణ, సుకన్య, ఉష, ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

గడువులోగా స్మార్ట్‌సిటీ పనులు పూర్తి చేయాలి

స్మార్ట్‌సిటీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, జూన్ 10: గడువులోగా స్మార్ట్ సిటీ పనులను పూర్తి చేయాలని గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె నగరవ్యాప్తంగా జరుగుతున్న స్మార్ట్‌సిటీ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భద్రకాళీ బండ్‌తో పాటు బీఆర్‌నగర్, మడికొండ, కడిపికొండ, గోకుల్‌నగర్, ప్రెసిడెన్సీ స్కూల్, రాజాజీనగర్ ప్రాంతాల్లో పనులను పరిశీలించి, అధికారులకు సూచనలు ఇచ్చారు. భద్రకాళీ బండ్ పనులు 90 శాతం పూర్తయ్యాయని, డ్రైనేజీ పనులతో పాటు ఫినిషింగ్ పనులు మాత్రమే మిగిలాయని అధికారులు వివరించారు.

ఊరించి.. ఉసూరుమనిపించి

యువత స్వయంఉపాధి కోసం ఆర్థిక సహాయం అందించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం అమలు చేస్తామని గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులను ఊరించి..ఉసూరుమనిపించింది. రుణ మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టే సమయంలో పథకాన్ని నిలిపివేయడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో 33,027 మంది దరఖాస్తు చేసుకోగా, సర్కారు నిర్ణయంతో వారు నిరాశకు లోనవుతున్నారు. - వరంగల్, జూన్ 10

- ఆర్‌వైవీని నిలిపి వేసిన కాంగ్రెస్ సర్కారు
- యువత ఆశలు ఆవిరి, రుణ మంజూరు నిలిపి వేయాలని ఆదేశాలు
- ప్రక్రియను పక్కన పెట్టిన అధికారులు
- గ్రేటర్ 33,027 మంది ఆశల గల్లంతు

రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. ఎలాంటి రుణ మంజూరు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో యువత ఆశలు గల్లంతయ్యాయి. దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరి సిబిల్ స్కోర్‌ను మెప్మా అధికారులు బ్యాంకుల నుంచి సేకరించారు. గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్ల నుంచి 33,027 మంది యువత ఈ పథకానికి దరఖాస్తులు చేసుకుంది. వారంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాలు పొంది ఆర్థికంగా స్థిరపడాలన్న ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లడంతో నిరాశలో మునిగిపోయారు.

ఆర్‌వైవీ ప్రక్రియను పక్కకు పెట్టిన అధికారులు

20 రోజుల క్రితమే ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టకూడదని స్పష్టంగా పేర్కొంది. దీంతో అధికారులు ఆ ప్రక్రియను పక్కన పెట్టారు. రూ. 50 వేల నుంచి 4 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి నిరుద్యోగ యువత జీవితంలో స్థిరపడేలా చేయూత అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు చేతులెత్తేసింది. తొలుత రూ. 50 వేలు, లక్ష రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి సబ్సిడీలను బ్యాంకులకు పంపించాలని సర్కారు ఆదేశించింది. ఆ ప్రక్రియను చేసేలోపే పూర్తిగా పథకాన్ని ప్రస్తుతం నిలిపివేస్తున్నామని ప్రకటించింది.

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వర్ధన్నపేట, జూన్ 10: మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాగరాజు మంగళవారం క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. వర్ధన్నపేట పట్టణం, గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ. 14.28 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎల్‌బీనగర్‌లో నేత్ర వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, జూన్ 10: వాసన్ ఐ కేర్, హెచ్ఆర్ భాను, బీజేపీ ఆధ్వర్యంలో ఎల్‌బీ నగర్‌లోని పద్మశాలీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

రవీందర్‌నాయక్‌ను పరామర్శిస్తున్న శంకర్‌నాయక్

డీహెచ్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

సంగెం, జూన్ 10: రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ తండ్రి బానోత్ శంకర్‌లాల్ ఇటీవల అనారోగ్యంతో మండలంలోని బిక్కోజీనాయక్‌తండాలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తండాకు చేరుకొని శంకర్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవీందర్‌నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, నాయకులు ఉండీల రాజు, బుక్క మల్లయ్య, శ్రీనివాస్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సంగెం, జూన్ 10: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని లోహిత గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముంజాల శ్రీనివాస్ తాటిచెట్టు ఎక్కి దిగుతున్న క్రమంలో మోకు జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ఎంజీఎం దవాఖానకు తరలించారు.